క్లుప్తంగా

51వ వార్డులో కొత్త పింఛన్ల పంపిణీ



మహిళకు పెన్షన్ అందిస్తున్న వెంకటరమణ

మద్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డులో కొత్తగా మంజూరైన పింఛన్లను కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ లబ్ధిదారులకు అందజేశారు. వార్డు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో కొత్తగా మంజూరైన 23 మందికి రూ.3 వేలు అందించారు. ఆయన మాట్లాడుతూ అవ్వా తాతలకు, ఒంటరి మహిళలకు, దివ్యాంగులకు ఈ పెన్షన్ భరోసా ఇస్తోందన్నారు. కార్యక్రమంలో సచివాలయ వెల్ఫేర్ కార్యదర్శులు, వలంటీర్లు, కరిమిరెడ్డి శ్యామ్, గణేష్, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

గంగరాజుకు యువ శాస్త్రవేత్త అవార్డు



సీతంపేట: స్థానిక బుల్లయ్య కళాశాలలో భౌగోళిక శాస్త్రంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఎం.గంగరాజు నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ అకాడమీ ద్వారా 2023 సంవత్సరానికి యువ శాస్త్రవేత్త అవార్డు అందుకున్నారు. బుల్లయ్య కళాశాలలో ఏడు సంవత్సరాలుగా పనిచేస్తూ, విశాఖ జిల్లాలోని గిరిజన మరియు తీరప్రాంతాలకు మధ్య వ్యాధుల తీవ్రత వ్యత్యాసంపై రిమోట్ సెన్సింగ్, జియోగ్రాఫికల్ ఇన్ఫర్మేషన్ సిస్టంతో పరిశోధన పత్రం సమర్పించినందుకు గాను యంగ్ సైంటిస్ట్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి. మధుకుమార్, ప్రిన్సిపాల్స్ జి.ఎస్.కె.చక్రవర్తి, ఆర్.వి.హెచ్.శ్రీకాంత్, కె.సోమేశ్వరరెడ్డి, సోషల్ సైన్సెస్ విభాగాధిపతి జె.లక్ష్మణ్‌బాబు అభినందించారు.

సామాజిక న్యాయ మహాశిల్పం సంతకాల సేకరణ



బ్యానర్‌పై సంతకం చేస్తున్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్

సీతంపేట: ఈ నెల 19న విజయవాడలో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహం ఆవిష్కరణ సందర్భంగా 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ వార్డు కార్యాలయంలో సంతకాల సేకరణ కార్యక్రమం జరిగింది. భారతరత్న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం సంతకాల సేకరణ చేపట్టారు. అంబేడ్కర్ నిర్దేశించిన సామాజిక న్యాయ మార్గంలో నడుస్తానని ప్రతిజ్ఞ చేస్తున్నానని తెలియజేసేలా సంతకాల సేకరణ జరిగింది. ముందుగా అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సచివాలయం అడ్మిన్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

షిర్డీ సాయి ఆలయంలో హుండీల ఆదాయం లెక్కింపు



హుండీల ఆదాయం లెక్కిస్తున్న శ్రీహరి సేవకులు

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు, సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని శ్రీ మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర స్వామి, అయ్యప్ప, షిర్డీ సాయిబాబా ఆలయంలో హుండీల ఆదాయాన్ని లెక్కించారు. ఆలయ పర్యవేక్షణాధికారి అల్లు జగన్నాధరావు, కార్యనిర్వహణాధికారి పైలా శేఖర్‌బాబు ఆధ్వర్యంలో శ్రీహరి సేవకులు లెక్కింపులో పాల్గొన్నారు. 130 రోజులకు సంబంధించి రూ. 10 లక్షల 2 వేల 260 వచ్చిందని ఈవో తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ సభ్యులు జాన్సీ, సుధారాణి, సిబ్బంది వనజాక్షి, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'కొండ'ంత అభివృద్ధి

- 46వ వార్డులో అధ్వాన స్థితి నుంచి ఆధునికీకరణ
- సీసీ, బీటీ, డ్రైనేజీలు, రక్షణ గోడలు, మెట్ల మార్గాల అభివృద్ధి
- కొండవాలులో రక్షణ చర్యలతో స్థానికుల హర్షం



శాంతినగర్‌లో నిర్మించిన గెడ్డలకు రక్షణగోడలు



సంజీవయ్య కాలనీలో డ్రైనేజీలు

కంచరపాలెం : జీవీఎంసీ 46వ వార్డు కంచరపాలెం, తాటిచెట్లపాలెం, కైలాసపురం కొండవాలులో మౌలిక సదుపాయాలకు మోక్షం కలిగింది. గతంలో టీడీపీ హయాంలో జరగని కొండవాలు అభివృద్ధి ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరుగుతుండడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నాలుగున్నరేళ్లలో శాంతినగర్, మధుసూదనగర్, కైలాసపురం, సంతోషనగర్, సూరిబాబునగర్, లక్ష్మీనారాయణపురం, కస్తూరినగర్-1, 2 ప్రాంతాల్లో కోట్ల వ్యయంతో సీసీ, బీటీ రోడ్లు, డ్రైనేజీలు, కాలువలు, రక్షణ గోడలు. కమ్యూనిటీ హాళ్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఓపెన్ జిమ్‌లు, విద్యుత్ లైట్లు, మెట్ల మార్గాలు ఇలా పలు అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. వార్డు కార్పొరేటర్, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్.. వార్డులోని సమస్యలను జీవీఎంసీ కమిషనర్, నగర మేయర్, విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు, ఇంజినీరింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం, ఎంపీ, జీవీఎంసీ నిధుల నుంచి కోట్ల రూపాయలు మంజూరు కావడంతో అభివృద్ధి పనులు చకాచకా పూర్తి చేశారు.

త్వరితగతిన నిర్మాణ పనులు

వార్డు భౌగోళిక స్వరూపం అంతా కొండవాలు ప్రాంతం కావడంతో అభివృద్ధి జాడ కనిపించలేదు. దీంతో కార్పొరేటర్, డిప్యూటీ మేయర్ సతీష్ కృషితో మౌలిక సదుపాయాలు సమకూరాయి. సీసీ రోడ్లు, డ్రైనేజీలు, బీటీ రోడ్లు, మెట్ల మార్గాలు, కొండవాలుకు రక్షణగోడలు, కాలువలు, గెడ్డలు-రక్షణ గోడలు, మెట్ల మార్గాలకు రెయిలింగ్, కమ్యూనిటీ హాళ్లు తదితర మౌలిక వసతుల అభివృద్ధి నిర్మాణానికి, మరమ్మతు పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇప్పటికే సుమారు రూ.6.58 కోట్లతో చేపట్టిన పనులు పూర్తి కాగా.. మరో రూ.3 కోట్ల నిధులతో తలపెట్టిన పనులు చురుగ్గా సాగుతున్నాయి. దీంతో కొండవాలు ప్రాంతాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

46వ వార్డు కొండవాలులో అభివృద్ధి పనులు ఇలా..

ప్రాంతం	పనులు	నిధులు
లక్ష్మీనారాయణనగర్, మధుసూదనగర్, సూరిబాబునగర్, కసుర్తినగర్-1, 2, సంజీవయ్య కాలనీ	సీసీ రోడ్లు	రూ.63లక్షలు
మధుసూదనగర్, కస్తూరినగర్, శాంతినగర్, సంజీవయ్య కాలనీ	మెట్లమార్గాలు(సీసీ)	రూ.48లక్షలు
3. మధుసూదనగర్, శాంతినగర్, సూరిబాబునగర్, కస్తూరినగర్-1,2 సంజీవయ్యకాలనీ	డ్రైనేజీలు(సీసీ)	రూ.51 లక్షలు
కస్తూరినగర్	అంగన్‌వాడీ భవనం	రూ.7లక్షలు
శాంతినగర్	కళావేదిక	రూ.35 లక్షలు
శాంతినగర్	కమ్యూనిటీ హాల్	రూ.15లక్షలు
శాంతినగర్	రక్షణ గోడ	రూ.20 లక్షలు
మధుసూదనగర్, కస్తూరినగర్, లక్ష్మీనారాయణపురం, సంజీవయ్య కాలనీ	సీసీ రోడ్లు	రూ.1.92 కోట్లు
కస్తూరినగర్, శాంతినగర్, మధుసూధనగర్, సంజీవయ్యకాలనీ, లక్ష్మీనారాయణపురం	మెట్లమార్గాలు	రూ.65లక్షలు.
మధుసూదనగర్, శాంతినగర్, కస్తూరినగర్-1,2 సంజీవయ్య కాలనీ	సీసీ డ్రైనేజీలు	రూ.38లక్షలు.
మధుసూదనగర్, సంతోషనగర్, శాంతినగర్, కస్తూరినగర్	రెయిలింగ్ వర్కులు	రూ.25లక్షలు
సంజీవయ్య కాలనీ	కమ్యూనిటీహాల్	రూ.35లక్షలు
లక్ష్మీనారాయణపురం	గెడ్డకు రక్షణగోడ	రూ.22లక్షలు
సంతోషనగర్	బీటీ రోడ్డు	రూ.45లక్షలు
కస్తూరినగర్	కమ్యూనిటీ హాల్	రూ.16 లక్షలు





మధుసూదన్‌నగర్‌లో కమ్యూనిటీ హాల్



సంతోష్‌నగర్‌లో బీటీ రోడ్డు నిర్మాణం



కస్తూరినగర్‌లో అభివృద్ధి చేసిన మెట్ల మార్గాలు



కొండవాలులో రెయిలింగ్ ఇలా..

నమ్మకంగా అభివృద్ధి చేశారు..



కొండవాలులో ఎన్నో ఏళ్లుగా నివాసం ఉంటున్నాం. మౌలిక వసతుల జాడ ఏనాడూ కనిపించలేదు. నాలుగేళ్ల క్రితం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి నమ్మి ఓటేశాం. ఆయన నమ్మకంగా మా కొండవాలు అభివృద్ధికి కృషి చేశారు. స్థానిక కార్పొరేషన్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలవడంతో నిధులు పుష్కలంగా మంజూరయ్యాయి. ఇప్పటికే 92 శాతం అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. వచ్చే ఐదేళ్లు కూడా సీఎంగా జగనన్నే ఉండాలి.

– కె.అన్నపూర్ణ, సూరిబాబునగర్

ప్రజల సహకారంతో అభివృద్ధి



కొండవాలు ప్రాంతాలను అభివృద్ధి చేయడం ఎంతో కష్టతరంతో కూడిన పని. ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలన్నదే నా ఆశయం. రాష్ట్ర ప్రభుత్వం, జీవీఎంసీ, ఎంపీ నిధులు మంజూరు కావడంతో వార్డును అభివృద్ధి పథంలో నడిపించగలుగుతున్నా. వార్డును స్మార్ట్‌గా అభివృద్ధి చేయడానికి ప్రజల సహకారం కూడా కావాలి. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రి చేసుకుంటే మరింత అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుంది.

– కటుమూరి సతీష్, డిప్యూటీ మేయర్.

ప్రజా సంకల్పయాత్ర చరిత్రాత్మకం



కేక్ కట్ చేస్తున్న నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు

సీతమ్మధార: ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేసిన ప్రజా సంకల్పయాత్ర చరిత్రాత్మకమని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు అన్నారు. ప్రజా సంకల్ప యాత్ర పూర్తయి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో మంగళవారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేకే రాజు కేక్ కట్ చేసి, పార్టీ శ్రేణులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాదయాత్రలో ఇచ్చిన హామీలను జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం 99 శాతం నెరవేర్చారన్నారు. పేదల కష్టాలు విని, వారి కోసం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తూ వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్‌రాజు, సాడి పద్మారెడ్డి, ఆళ్ల లీలావతి, వి.ప్రసాద్, కె.వి.ఎస్. శశికళతో పాటు పేడాడ రమణి కుమారి, కిరణ్‌రాజు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కళ్లద్దాల పంపిణీ

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు తాటిచెట్లపాలెంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు భరణికాన రాజు యాదవ్ ఆధ్వర్యంలో రోగులకు ఉచితంగా కళ్లద్దాలను అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గీతం సంస్థల చైర్మన్ ముతుకుమిల్లి శ్రీ భరత్ విచ్చేసి, కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజు యాదవ్ మాట్లాడుతూ ఇటీవల గీతం హాస్పిటల్ సౌజన్యంతో వార్డులో నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరంలో కంటి అద్దాలు అవసరమైన వారిని గుర్తించి, ఇప్పుడు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పైలా ముత్యాలనాయుడు, రాష్ట్ర ముస్లిం కార్యదర్శి షేక్ బాబ్జీ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కోట నరేష్, జిల్లా పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పలిశెట్టి అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

వైభవుని సన్నిధిలో ధనుర్మాస పూజలు

- గోదాదేవికి పొన్నాకుల హారతి సమర్పించిన భక్తులు



పూజల్లో పాల్గొన్న భక్తులు



శ్రీవారి పాదాలు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా వైభవుడికి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు గోదా అమ్మవారికి పొన్నాకుల హారతి సమర్పించారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్ పర్యవేక్షణలో అర్చకులు వాసుదేవాచార్యులు, శేషాచార్యులు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు. సంక్రాంతి శోభలో భాగంగా ఆవరణలో రంగులతో వేసిన శ్రీవారి పాదాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

పాఠశాలల్లో ఫుడ్ ఫెస్టివల్స్ సందడి



విశ్వతేజ స్కూల్లో వంటకాలు తయారుచేసిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ సుజాత



హరగోపాల్ స్కూల్‌లో ఫుడ్ ఫెస్టివల్‌లో పాల్గొన్న విద్యార్థులు, తల్లిదండ్రులు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డు తాటిచెట్లపాలెం పరిధిలోని పలు పాఠశాలల్లో సంక్రాంతి సందర్భంగా ప్రత్యేకంగా ఫుడ్ ఫెస్టివల్స్ నిర్వహించారు. విశ్వతేజ స్కూల్లో విద్యార్థులే స్వయంగా వంటకాలు చేసి స్టాల్స్‌లో ప్రదర్శించారు. కరస్పాండెంట్ భాస్కరరావు, ప్రిన్సిపాల్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

- రైల్వేన్యూకాలనీలోని హరగోపాల్ స్కూల్లో నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్‌ను ప్రిన్సిపాల్ శంకర్రావు నాయుడు ప్రారంభించారు. విద్యార్థులను రెండు కేటగిరీలుగా విభజించారు. మొదటి కేటగిరీలో సుమారు 150, రెండో కేటగిరీలో సుమారు 165 రకాల సౌత్ ఇండియన్, నార్త్ ఇండియన్ వంటకాలు తయారు చేశారు. వాటిలో ఉత్తమ వంటకాలను గుర్తించి బహుమతులను అందించారు.

ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు

మురళీనగర్: మురళీనగర్‌లోని లిటిల్ చాంప్స్ పాఠశాలలో మంగళవారం నిర్వహించిన సంక్రాంతి సంబరాలు ఉత్సాహంగా సాగాయి. సంక్రాంతి శోభను ప్రతిబింబించే విధంగా ఆవరణలో రంగురంగుల ముగ్గులు వేశారు. చిన్నారులు సంప్రదాయ దుస్తుల్లో ఆకట్టుకున్నారు.

గ్రీన్‌బెల్ట్ .. కళకళ



సత్యం సెంటర్ వద్ద మొక్కలతో కళకళలాడుతున్న వాకింగ్ ట్రాక్

సీతంపేట: స్థానిక సత్యం సెంటర్ వద్ద హైవేను ఆనుకుని ఉన్న గ్రీన్‌బెల్ట్ ప్రాంతంలో సుమారు రూ.25 లక్షలతో ఇటీవల అభివృద్ధి చేసిన వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్ ప్రాంతంలో జీవీఎంసీ హార్టికల్చర్ సిబ్బంది పూల మొక్కలు, ఆకర్షణీయమైన క్రోటన్స్ మొక్కలు నాటారు. వాకింగ్ ట్రాక్‌లో నడిచేవారికి, ఓపెన్ జిమ్‌లో వ్యాయామం చేసే వారికి ఆహ్లాదాన్ని అందించేలా పూల మొక్కలు నాటారు. పచ్చదనంతో ట్రాక్‌ను తీర్చిదిద్దారు. దీంతో పర్యావరణ ప్రేమికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అంబేడ్కర్ విగ్రహ పోస్టర్ ఆవిష్కరణ



డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ పోస్టర్ ఆవిష్కరిస్తున్న కేకే రాజు

సీతమ్మధార : ఈ నెల 19న విజయవాడలో జరగనున్న డా. బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహానికి సంబంధించిన పోస్టర్‌ను బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ ఉత్తర కార్యాలయంలో నెడ్‌క్యాప్ చైర్మన్, ఉత్తర సమన్వయకర్త కేకేరాజు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్, మండల అధ్యక్షుడు కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్, పార్టీ మండల అధ్యక్షుడు బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మండల పార్టీ అధ్యక్షుడు అల్లు శంకరరావు, కార్పొరేటర్లు కె,.అనిల్‌కుమార్‌రాజు, సాడి పద్మారెడ్డి, ఆళ్ల లీలావతి, వి.ప్రసాద్, కెవీఎస్, శశికళ పేడాడ రమణికుమారి,కిరణ్‌రాజు, సీనియర్ నాయకులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, సచివాలయ కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మిద్దె తోటల పెంపకంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న పీవో లక్ష్మి

సీతంపేట: నగరంలో పచ్చదనం పెంపొందించేందుకు జీవీఎంసీ అన్ని జోన్ల పరిధిలో మిద్దె తోటల పెంపకంపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని జీవీఎంసీ ఎకో నోడల్ అధికారి, ప్రాజెక్ట్ ఆఫీసర్ డి.లక్ష్మి తెలిపారు. జీవీఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు ఎకో వైజాగ్, ఎకో గ్రీన్ కార్యక్రమాలలో భాగంగా అక్కయ్యపాలెం పరిధిలోని రామచంద్రానగర్ కాలనీలో వంద మందికి పైగా గృహస్తులను ఎంపిక చేసి మిద్దె తోటల పెంపకంపై మంగళవారం యూసీడీ అధికారులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతీ భవనంపై, అపార్ట్‌మెంట్ మెట్లపై, గేటెడ్ కమ్యూనిటీల వద్ద మిద్దె తోటలు పెంచాలని సూచించారు. కావలసిన కూరగాయలు, పండ్లు, ఔషధ మొక్కలను ఇళ్లల్లో పెంచుకోవడం ద్వారా ఆరోగ్య పరిరక్షణతో పాటు, ఆర్థిక లాభం చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో టీమ్ సిటీ టెర్రస్ గార్డెన్స్ సభ్యులు విజయలక్ష్మి, ప్రభాల్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా పవర్ లిఫ్టింగ్ పోటీలు

సీతంపేట: ఆంధ్రా యూనివర్సిటీ అంతర కళాశాలల పవర్ లిఫ్టింగ్ మహిళలు, పురుషుల చాంపియన్‌షిప్ పోటీలు మంగళవారం బుల్లయ్య కళాశాలలో ప్రారంభమయ్యాయి. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్ పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలలో బుల్లయ్య కళాశాల క్రీడాకారులు పలు విభాగాలలో విజేతలుగా నిలిచారు. పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ సౌత్ ఇండియా సెక్రటరీ ఎస్.కోటేశ్వరరావు ఈ పోటీలకు న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు.

అప్పన్న సన్నిధిలో 'పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ'



అప్పన్న ఆలయంలో కమిటీ చైర్‌పర్సన్ జగదాంబిక పాల్, సభ్యులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని మంగళవారం పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఆన్ ఎనర్జీ బృందం దర్శించుకుంది. కమిటీ చైర్‌పర్సన్ జగదాంబిక పాల్, సభ్యులు కిసాన్ కపూర్, సునీల్ కుమార్ మోండల్, కేఆర్‌ఎస్.రాజేష్ కుమార్ స్వామిని దర్శించుకున్న వారిలో ఉన్నారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద వీరికి పూర్ణ కుంభంతో అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం వీరంతా ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని ఏఈవో భ్రమరాంబ అందజేశారు. సూపరింటిండెంట్ పిళ్లా శ్రీనివాస్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

విద్యాభివృద్ధిలో భాగస్వామ్యం అవసరం



డైరీ, క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న డీఈవో చంద్రకళ. సంఘం నాయకులు

విశాఖ విద్య: విద్యాభివృద్ధిలో ఉపాధ్యాయ సంఘాలు భాగస్వామ్యం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని డీఈవో ఎల్.చంద్రకళ అన్నారు. వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ముద్రించిన 2024 సంవత్సరపు క్యాలెండర్లు, డైరీలను మంగళవారం తన చాంబర్‌లో ఫెడరేషన్ నాయకులతో కలసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చొక్కాకుల సూర్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి బాదిరెడ్డి గంగాధర్, జిల్లా ముఖ్యగౌరవ సలహాదారు జగన్నాథరావు, కోశాధికారి సంధ్యారాణి, గోవింద, నాగేశ్వరావు పాల్గొన్నారు.